సాక్షి
తిరుపతి
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



**మాదక ద్రవ్యాలకు దూరంగా..**
యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. 3కే రన్‌ను ఆయన ప్రారంభించారు. - 8లో



**జెండా పండుగలో 11 స్టాల్స్**
ఆగస్టు 15 జెండా పండుగలో 11 స్టాల్స్, 7 శకటాలు ఏర్పాటు చేయనున్నట్టు జేసీ శుభం బన్సాల్ తెలిపారు. - 8లో



**టీటీడీకి ఎరువుల వితరణ**
టీటీడీ ఉద్యాన వనానికి కోరమండల్ వారు రూ.4.10 లక్షల విలువ చేసే ఎరువులను వితరణగా అందజేశారు. - 8లో

# చెదిరిన ఆశలు..
# పగిలిన గుండెలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్) మృతిచెందిన చేతన్

బిడ్డలు ఉన్నత చదువులు చదవాలని ఆశపడ్డారు. పాఠశాల స్థాయి నుంచే ఉన్నతంగా రాణిస్తున్న కుమారులను చూసి సంబరపడ్డారు. చెట్టంత కొడుకులు చరమాంకంలో అండగా నిలుస్తారని కలలుగన్నారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. కన్న కలలు కల్లలయ్యాయి. అప్పటి వరకు వీడియో కాల్‌లో ఫోన్లో మాట్లాడిన బిడ్డలు అంతలోనే రోడ్డు ప్రమాదానికి గురయ్యారని తెలుసుకుని కుప్పకూలారు. 'అమ్మా.. హ్యాపీ బర్త్‌డే.. కాలేజీకి వెళ్లాక నువ్వు జీవితంలో మరిచిపోలేని విధంగా రిటర్న్ గిఫ్ట్ పంపిస్తానంటూ.. చెప్పిన మాటలు కన్నీటి మూటలయ్యాయి. దైవదర్శనానికి వెళ్లి మరికొంత సమయంలో కళాశాలకు వెళ్తామని చెప్పిన కుమారుడు అంతలోనే దూరమయ్యాడని తెలుసుకుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విగత జీవులుగా ఇంటికొచ్చిన బిడ్డలను చూస్తూ.. ఎక్కిళ్లు పెడుతూ.. కన్నీటి సుడుల్లో ప్రేమను పంచిన తీరు గుండెల్ని మెలిపెట్టింది. ఆదివారం రాత్రి తమిళనాడు సరిహద్దులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు సోమవారం స్వగ్రామాలకు చేరుకున్నాయి.

## రిటర్న్ గిఫ్ట్ ఇలా పంపించావా కన్నా!



చేతన్ పార్థీవదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

- హ్యాపీ బర్త్ డే మమ్మీ
- వచ్చి విష్ చేయాలనుకున్నా.. ఫ్రెండ్స్ తొందర చేస్తున్నారు
- సారీ అమ్మా.. రాలేకపోతున్నా
- అంతలోనే అనుకోని ప్రమాదం
- తల్లి పుట్టిన రోజే అనంత లోకాలకు
- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- చేతన్‌తో పాటు మరో నలుగురు మృతి
- శోకసంద్రంలో మిలటరీ కాలనీ

**తిరుపతి రూరల్:** 'అమ్మా.. ఐ లవ్ యూ. హ్యాపీ బర్త్ డే మమ్మీ. నీ దగ్గరకు వచ్చి నీ చేత్తో స్వీట్స్ తిని.. విషెష్ చెప్పి మంచి గిఫ్ట్ ఇద్దామనుకున్నా. ఫ్రెండ్స్ తొందర చేస్తున్నారు. తిరువణ్ణామలైలో నాన్న రెకమెండేషన్‌తో మంచి దర్శనం అయ్యింది. ఇప్పుడే కాణిపాకంలోనూ దర్శనం పూర్తిచేసుకున్నాం. కారుని నేనే డ్రైవ్ చేస్తున్నా. కాణిపాకం నుంచి కాలేజీకి రిటర్న్ అవుతున్నాం. సారీ మమ్మీ రాలేకపోతున్నా. చెన్నైకి వెళ్లిన తర్వాత నాన్నకు చెప్పి మంచి రిటర్న్ గిఫ్ట్ పంపుతాను. లవ్ యూ మా..' అంటూ కుమారుడు వీడియో కాల్‌లో పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడంతో ఆ తల్లి పొంగిపోయింది. తనకు ఎలాంటి 'రిటర్న్ గిఫ్ట్ పంపిస్తాడో' అంటూ మనసులోనే ఊహించుకుంటూ సంబరపడింది. కానీ తన పుట్టిన రోజు నాడే కారు ప్రమాదంలో కుమారుడు తనువు చాలించాడని తెలుసుకుని గుండెలవిసేలా రోదించింది. బర్త్ డే నాడు రిటర్న్ గిఫ్ట్ పంపిస్తావని ఎదురు చూస్తుంటే.. ఇలా శవమై వచ్చావా కన్నా..' అంటూ కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కలచివేసింది. ఈ ఘటన తిరుపతి రూరల్ మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాలు.. తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీ, మిలటరీ కాలనీలో నాగేంద్రబాబు, సురేఖ దంపతులు ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉండగా.. చిన్న కుమారుడు చేతన్ చెన్నైలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. తన తల్లి సురేఖ పుట్టినరోజు కావడంతో ఆదివారం ఏడుగురు ఫ్రెండ్స్‌తో కలిసి కారులో తిరువణ్ణామలై, కాణిపాకం దర్శనం కోసం బయలుదేరారు. ఉదయం తిరువణ్ణామలై, మధ్యాహ్నం కాణిపాకం వరసిద్ధి వినాయకుడ్ని దర్శనం చేసుకున్నారు. కాణిపాకం దాకా వచ్చాము కదా.. ఈ రోజు అమ్మ పుట్టినరోజు.. అందరం వెళ్లి అమ్మకు విషెష్ చెప్పి అటు నుంచి చెన్నై వెళ్దాం ..అంటూ ఫ్రెండ్స్‌ని చేతన్ కోరాడు. అయితే ఇప్పటికే లేటు అయ్యింది.. కాణిపాకం నుంచే వెళ్లిపోదాం.. అని ఫ్రెండ్స్ బలవంతం చేశారు. దీంతో తల్లికి ఫోన్ చేసిన చేతన్.. మరోసారి హ్యాపీ బర్త్ డే మమ్మీ.. ఫ్రెండ్స్ తొందర చేస్తున్నారు.. జీవితంలో గుర్తుండిపోయేలా మంచి రిటర్న్ గిఫ్ట్ పంపిస్తాను... అంటూ వీడియో కాల్‌తో తల్లికి విషెస్ చెప్పాడు. కాణిపాకం నుంచి ఆదివారం రాత్రి చెన్నై వెళ్తున్న సమయంలో ఆగి ఉన్న లారీని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో చేతన్‌తో పాటు కారులో ఉన్న మరో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం సోమవారం చేతన్ మృతదేహాన్ని మిలటరీ కాలనీలోని ఇంటికి తీసుకువచ్చారు.



చేతన్(ఫైల్)

### శోకసంద్రంలో మిలటరీ కాలనీ

నవ్వుతూ, నవ్విస్తూ, ఎప్పుడు ఉత్సాహంగా ఉండే చేతన్ కారు ప్రమాదంలో మృతి చెందాడనే వార్త గాంధీపురం పంచాయతీలోని మిలటరీ కాలనీని శోకసంద్రంలో ముంచేసింది. అమ్మానాన్న, అన్నను బాగా చూసుకుంటానని చెప్పిన చెట్టంత కొడుకు శవమై రావడంతో తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. అనంతరం చేతన్ అంత్యక్రియలను బంధుమిత్రుల మధ్య నిర్వహించారు.

## ఎంత పనిచేశావు దేవుడా?

- నీ దర్శనానికి వచ్చినా కరుణించలేదేమీ?
- సరస్వతీ పుత్రుడిని కాపాడలేదయ్యా!
- మేమెలా బతికేది నాయనా?
- కన్నీరుమున్నీరైన కోవనూరు
- తనయుడు యుగేష్‌ను చూసి తల్లడిల్లిన తల్లిదండ్రులు



కోవనూరుకు చేరుకున్న యుగేష్ మృతదేహం

**వరదయ్యపాళెం:** 'నిన్ను దర్శించి..సేవించాడు. నీ ప్రేమ, కరుణ, కృపాకటాక్షాలు పొందాడు. తిరిగి కళాశాలకు బయల్దేరిన కుమారుడిని మృత్యువు నుంచి కాపాడలేకపోయావు నాయనా..! మేమేం చేశాం పాపం.. మాకెందుకింత శాపం.. ఎలా బతికేది దేవుడా..? మాకు దిక్కెవరు నాయనా..? అంటూ ఆ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు కలచివేసింది. సరస్వతీ పుత్రుడు, చేతికొచ్చిన కొడుకుని తీసుకెళ్లిపోయావా దేవుడా..? అంటూ కన్నీరుమున్నీరుగా విలపించడం గుండెల్ని మెలిపెట్టింది. ఈ ఘటన కేవీపురం మండలం, కోవనూరులో విషాదాన్ని నింపింది.

కోవనూరు గ్రామానికి చెందిన చింతా కిరణ్‌యాదవ్, ధనమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో మొదటి అబ్బాయి చింతా యుగేష్ చెన్నై సమీపంలోని ఎస్ఆర్ఎం కాలేజీలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, రెండో కుమారుడు విజయవాడలో పదో తరగతి చదువుతున్నాడు. కిరణ్‌యాదవ్ ప్రయివేటు వ్యాపారికాగా.. ఆయన భార్య ధనమ్మ రుయా ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. వీరు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని భావించి 20 ఏళ్ల క్రితం పొట్టచేతబట్టుకుని తిరుపతిలోని లీలామహల్ సమీపంలో స్థిరపడ్డారు.

**ప్రమాదం ఇలా..**

రెండు రోజులు సెలవు కావడంతో విద్యార్థి యుగేష్, తన స్నేహితులు మరో ఆరుగురితో కలసి ఏడుగురు విద్యార్థులు కారులో శనివారం మొదట తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. తర్వాత కాణిపాక వినాయకుడిని దర్శించి ఆదివారం రాత్రి చెన్నైకి బయలుదేరారు. మార్గమధ్యంలోని తిరువళ్లూరు జిల్లా, కనకమ్మ సత్రం సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న లారీ కారును ఢీకొంది. యుగేష్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. యుగేష్ మృత దేహానికి తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రిలో శవపంచనామా అనంతరం సోమవారం సాయంత్రం 5 గంటలకు స్వగ్రామమైన కోవనూరుకు తరలించారు. దీంతో ఒక్కసారిగా మృతుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం యుగేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చారు.

### సరస్వతీ పుత్రుడు యుగేష్



మృతి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి యుగేష్ (21) (ఫైల్)

చిన్న వయసు నుంచే యుగేష్ చదువులో ముందుండేవాడు. పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులతో సత్తాచాటాడు. ఆ దిశగా ఉన్నత లక్ష్యాలను ఎంచుకున్నాడు. ఇంజినీరింగ్ విద్యకు చెన్నైలోని ఓ ప్రయివేటు కళాశాలను ఎంచుకున్నాడు. ఇంజినీరింగ్ విద్యలో మంచి ప్రావీణ్యత చూపుతున్నాడు.

### క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికవుతానమ్మా!

'అమ్మా...మీ ఆశలు వమ్ము చేయను. నేను కళాశాలలో జరిగే క్యాంప్ ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అవుతా. మీరు ఆశించిన స్థాయిలో ఉద్యోగం సాధిస్తానమ్మా'అంటూ తల్లిదండ్రులకు యుగేష్ మాటిచ్చాడు. ఇంతలో పిడుగులా తమ కుమారుడి మరణవార్త విన్న తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## న్యూస్‌రీల్

### డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం



ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్

**తిరుపతి సిటీ:** 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 17 ప్రభుత్వ, 122 ప్రైవేటు, 3 టీటీడీ కళాశాలల్లో మొదటి దశ కౌన్సెలింగ్‌లో మెరిట్ విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న కళాశాల, కోర్సుల్లో అడ్మిషన్లు పొందారు. ఆయా కళాశాలల యాజమాన్యాలకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి వచ్చిన ప్రొవిజినల్ అలాట్‌మెంట్ ఆర్డర్ ప్రకారం ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. అడ్మిషన్ల నేపథ్యంలో సోమవారం తిరుపతిలోని ఎస్వీడబ్ల్యూ, ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతుల కుటుంబీకులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి క్రైమ్:** విధి నిర్వహణలో అకాల మరణం చెందిన పోలీసులకు వారికి రావలసిన నగదును జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో ఎస్ఐ రెడ్డినాయక్ భార్య సరోజాకు రూ.1,50,000, ఏఆర్ కానిస్టేబుల్ అనిల్ తల్లి సుశీలమ్మకు రూ.1,25,000, హోంగార్డు మోహన్ సతీమణి కవితకు రూ.15,000 నగదు చెక్కులు అందజేశారు. వీరంతా ఇటీవల విధి నిర్వహణలో మృతి చెందిన విషయం తెలిసిందే.

### వరలక్ష్మీ వ్రతం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు, ఏఈఓ, జేఈఓలు

**తిరుపతి(అలిపిరి):** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 16వ తేదీ జరగనున్న వరలక్ష్మీ వ్రతం కరపత్రాలను సోమవారం టీటీడీ ఈఓ జే.శ్యామలరావు ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఆవిష్కరించిన అనంతరం ఈఓ మాట్లాడారు. తిరుచానూరులోని ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరలక్ష్మీ వ్రతం జరగనుందని, అదేరోజున సాయంత్రం 6 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. టీటీడీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, ఆలయ డెప్యూటీ ఈఓ గోవిందరాజన్ పాల్గొన్నారు.

### దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో అధికారులు

**తిరుపతి అర్బన్:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని డీఆర్వో పెంచలకిషోర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని టూరిజం శాఖ నేతృత్వంలో ఘనంగా చేపట్టారు. దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆమేరకు కలెక్టరేట్ వద్ద అధికారులు జాతీయ జెండాను చేతపట్టి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అనంతరం హర ఘర్ తిరంగా ఫ్లెక్సీలపై సంతకాలు చేశారు. అధికారులచేత డీఆర్వో ప్రతిజ్ఞ చేయించారు. డెప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, చంద్రశేఖర్, కోదండరామిరెడ్డి, టూరిజం ప్రాంతీయ సంచాలకులు రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, డీఈఓ వీ.శేఖర్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీపీఓ సుశీలాదేవి, జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

### ఎస్వీజూలో ప్రపంచ ఏనుగుల దినోత్సవం



**తిరుపతి మంగళం:** తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో సోమవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని జూ క్యూరేటర్ సి.సెల్వం ఘనంగా నిర్వహించారు. ఎస్వీ జూలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఏనుగుల ప్రాముఖ్యత, వాటి ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులచేత ఏనుగులకు పండ్లు, కూరగాయలను ఆహారంగా అందించారు. కార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, అసిస్టెంట్ క్యూరేటర్ జగదీస్ చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## మహిళల చదువుకు ప్రాధాన్యం



కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు

**తిరుపతి సిటీ:** నగరంలోని శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల 73వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీ.నారాయణమ్మ మాట్లాడుతూ 1952 ఆగస్టు 11వ తేదీన అప్పటి కార్య నిర్వహణాధికారి శ్రీ అన్నారావు రాయలసీమలో మహిళల చదువు కోసం వీలుగా శ్రీ పద్మావతి మహిళా కళాశాలను స్థాపించారని చెప్పారు.

**పద్మావతిలో ప్రతిజ్ఞ**

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని తెలుగు అధ్యయన శాఖలో సామాజిక న్యాయం సాధికారికత మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' లో భాగంగా సోమవారం ప్రతిజ్ఞ చేపట్టారు. తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షురాలు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, పరిశోధక విద్యార్థినులు, అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిణి, డాక్టర్ డి.యువశ్రీ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌డేకు 164 అర్జీలు



కలెక్టరేట్‌లో అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో

**తిరుపతి అర్బన్:** కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాపరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి మొత్తం 164 అర్జీలు వచ్చినట్టు డీఆర్వో పెంచల కిషోర్ తెలిపారు. ఇందులో 110 అర్జీలు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలోనే ఉద్యోగులు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. గ్రీవెన్స్‌కు తప్పకుండా అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరుకావాలని స్పష్టం చేశారు. డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, చంద్రశేఖర్, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపరిష్కార వేదికకు 80 ఫిర్యాదులు**



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సుబ్బారాయుడు

**తిరుపతి క్రైం:** తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెలువెత్తినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 80 ఫిర్యాదులు అందినట్టు వెల్లడించారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అర్జీలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

## యథాస్థానాలకు తిరిగొచ్చిన ఎంపీడీఓలు

**చిత్తూరు కార్పొరేషన్:** ఎన్నికల నేపథ్యంలో పక్క జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీఓలు తిరిగి ఉమ్మడి జిల్లాకు వచ్చారు. ఐరాల మండలానికి నాగరాజు, నిమ్మనపల్లెకు శేషగిరిరావు, గుడుపల్లెకు ఎస్.తాజ్‌మసూర్, నింద్రకు అరుణ, పాకాలకు ప్రభాకర్, వడమాలపేటకు భానుమూర్తిరావు, తొట్టంబేడుకు సురేష్‌బాబు, వి.కోటకు చంద్రమౌళి, పీటీఎంకు బాలాజీ, చంద్రగిరికి బాలాజీనాయక్, ఎర్రావారిపాళ్యానికి అమరనాథ్, వాయల్పాడుకు మనోహరరాజు, తవణంపల్లెకు అబ్దుల్‌కలామ్‌ఆజాద్, నగరికి లీలామాధవి, పెనుమూరుకు నీలకంఠేశ్వరరెడ్డి, యాదమరికి శివరాజు, కేవీబీపురానికి రామచంద్ర, బీఎన్‌కండ్రిగకు సాయిలహరి బాధ్యతలు చేపట్టనున్నారు.




**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.72,080 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.6,473 |
| **వెండి:** | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.83,300 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.85.30 |

## క్లుప్తంగా

### అన్న ప్రసాదం ట్రస్ట్‌కు రూ.51 లక్షల విరాళం



అదనపు ఈఓకి విరాళం అందజేస్తున్న దాతలు

**తిరుమల:** హైదరాబాద్‌లోని పునర్షస్ ఆయుర్వేద ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బొమ్ము వెంకటేశ్వర రెడ్డి సోమవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.51,09,116 విరాళంగా అందజేశారు. తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి ఆ మేరకు దాత విరాళం చెక్కును అందించారు.

### టీటీడీకి రూ.4.10 లక్షల విలువైన ఎరువులు

**తిరుమల:** టీటీడీ ఉద్యాన విభాగానికి కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వారు రూ.4.10 లక్షల విలువైన ఎరువులను సోమవారం విరాళంగా అందించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఆర్‌ఎం రమణారెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ మురళి ఈ ఎరువులను తిరుమలకు చేర్చారు. కల్యాణ వేదిక వద్ద గల ఉద్యాన విభాగం కార్యాలయంలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులుకు అందజేశారు. ఉద్యానవనాల్లో మొక్కల పెంపకానికి ఈ ఎరువులను వినియోగిస్తారు.

### బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



తృతీయ స్థానంలో నిలిచిన కే.సునీల్

**సత్యవేడు:** తమిళనాడు మాధవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్యవేడు మండలం, కొల్లడం గ్రామానికి చెందిన రమణ, సెల్వి దంపతుల కుమారుడు కే.సునీల్ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఆదివారం మాధవరంలో 'ప్రపంచ ఫిట్నెస్ ఫెడరేషన్'ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమిళనాడు పూందమల్లి సవిత యూనివర్సిటీలో బీటెక్ నాల్గవ సంవత్సరం చదివే కే.సునీల్ తృతీయ స్థానంలో నిలిచాడు.

# జీవితాలతో జూదం!

అధికార అండదండలతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. జిల్లాలో విచ్చలవిడిగా పేకాట శిబిరాలు నిర్వహిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అమాయకులను జూదంలోకి లాగి జేబులు ఖాళీ చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన పోలీసు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. కళ్లెదుటే పేకాట శిబిరాలు జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడక పోవడం విమర్శలకు తావిస్తోంది.

- కూటమి ప్రభుత్వంలో పుట్టగొడుగుల్లా పేకాట శిబిరాలు
- తిరుపతి, శ్రీకాళహస్తి పుత్తూరు, రేణిగుంట, వెంకటగిరి, సూళ్లూరుపేట ప్రాంతాల్లో విచ్చలవిడిగా జూదాలు
- రోజూ చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- నియంత్రణ, నిఘా వ్యవస్థ లేక బుగ్గిపాలవుతున్న జీవితాలు



**చేతులు మారుతున్న రూ.కోట్లు**

| | |
|---|---|
| రోజూ చేతులు మారుతున్న సొమ్ము | - రూ.3 కోట్లు దాకా |
| ఇందులో టీడీపీ నాయకుల వాటా | - 20 శాతం |
| పోలీసుల జేబుల్లోకి | - 10 శాతం |

**తిరుపతి క్రైమ్:** కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో విచ్చలవిడిగా పేకాట శిబిరాలు వెలుస్తున్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి పుత్తూరు, రేణిగుంట, వెంకటగిరి, సూళ్లూరుపేట ప్రాంతాలు జూదాలకు నిలయాలు మారాయి. హోటళ్లు, లాడ్జీలు, నగర శివారు ప్రాంతాలకు అమాయక జనాన్ని రప్పించి పేకాట ఉచ్చులోకి దింపుతున్నారు. స్థానిక టీడీపీ నాయకులే నిర్వాహకులుగా మారి రోజుకు లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు. ఆటను బట్టి రేటు కుదిరించుకుంటున్నారు. రోజుకు ఒక స్థావరం, ఒక ప్రాంతం అంటూ ఎంచుకుని పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు.

**సౌకర్యాలకు కొదవలేదు**

పేకాట ఆడేందుకు వచ్చిన వారికి నిర్వాహకులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. వారికి భోజనం, మద్యం, మాంసం, సిగరెట్లు, సకాలంలో అందిస్తున్నారు. దీనికోసం సరీ్వస్ బాయ్‌ని ఏర్పాటు చేస్తున్నారు.

**కారు కూతలు.. పేకముక్కలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీల నాయకులు పేదల జీవితాలతో ఆటలాడుతున్నారు. అక్కడ.. ఇక్కడ అనే తేడా లేకుండా.. జిల్లా అంతటా విచ్చలవిడిగా పేకాట శిబిరాలు కొనసాగిస్తున్నారు. దీనికి నిదర్శనం ఇటీవల సాక్షాత్తు టీడీపీ ఎమ్మెల్యేనే.. సీఎంతో మాట్లాడుతాం.. పేకాట క్లబ్బులు జరిపిస్తాం.. జనాల మైండ్ సెట్‌ను పోగొడతామంటూ... కారు కూతలు కూసిన విషయం తెల్సిందే. ఇదే అదునుగా పేకాట రాయుళ్ల నిర్వాహకులకు కూడా కొండంత ధైర్యం.. కొండంత అండ.. బలం చేకూరింది. చిన్న, పెద్ద తేడా లేకుండా పేకాట ఆడుకుంటూ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు.

**శివారుప్రాంతాల్లోనే**

కేవలం అద్దె గదుల్లోనే కాదు.. శివారు ప్రాంతాల్లోనూ కొంతమంది జూదాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. దూరంగా ఉండే ప్రాంతాల్లో చెట్లకింద, తోటలు, పంట పొలాలను వేదికగా మార్చుకుంటున్నారు. ఆడేవారికి మినహా ఇతరులకు ఏమాత్రం సమాచారం లేకుండా ఔత్సాహిక సభ్యులు బృందంగా ఏర్పడి తాము నిర్ణయించుకున్న స్థలానికి చేరుకుంటున్నారు. మద్యం తాగడం, భోజనం చేయడం అక్కడే కానిచ్చేస్తున్నారు. సమయానికి డబ్బు లేకపోతే అప్పులు చేస్తున్నారు. కొందరైతే ఇంట్లో ఉన్న వస్తువులు సైతం తాకట్టు పెట్టేస్తున్నారు.

**భయపడడం లేదు**

పేకాట ఆడుతూ పట్టుబడుతున్న సంఘటనలు జిల్లాలో తరచూ చోటుచేసుకుంటున్నా ఎవరూ భయపడడంలేదు. ఒకవేళ పోలీసులకు పట్టుబడినా పెద్దగా శిక్షలేం లేకపోవడంతో, న్యాయస్థానంలో జరిమానా కట్టి బయటకు రావచ్చన్న ధీమాతో మూడు ముక్కలాటను నిర్విరామంగా కొనసాగిస్తున్నారు.


**గతంలో పేకాటకు చెక్**

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఫిజికల్ పేకాటతోపాటు, ఆన్‌లైన్ జూదానికి సంకెళ్లు వేశారు. పేకాట శిబిరాలపై తరచూ దాడులు నిర్వహించాలని పోలీసులకు దిశానిర్దేశం చేశారు. పట్టుబడిన పేకాట రాయుళ్లకు భారీ జరిమానా, శిక్ష పడేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత ఐదేళ్లు పేకాట అంటేనే జనాలు హడలిపోయారు.

**ఇదిగో సాక్ష్యం**

- తిరుపతిలో ఇద్దరు టీడీపీ ప్రధాన నాయకులే శిబిరాలు నిర్వహిస్తున్నారు. రోజుకు లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు పిండుకుంటున్నారు. వీరంతా లాడ్జీ ఓనర్లకు, పెద్దపెద్ద స్టార్ హోటళ్లకు పెద్ద మొత్తంలో నగదు ఆశజూపి రూములు అద్దెకు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు వస్తే తాము చూసుకుంటాం అంటూ నిర్వాహకులు వారికి భరోసా కల్పిస్తున్నారు. అంతే కాకుండా రోజుకో ప్రాంతంలో చోటు మారడంతో ఎవరికీ అనుమానం రావడంలేదు.
- శ్రీకాళహస్తిలో ఓ ప్రధాన నాయకుడు రోజుకో పల్లెలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నాడు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారికి ఫోన్ల ద్వారా చెప్పి.. లోకేషన్లు పెట్టి శిబిరాలకు రప్పిస్తున్నారు.

## ఖాళీ జాగా..వేసెయ్ పాగా!



జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న దాబా

- రూ.2కోట్ల విలువైన జాతీయ రహదారి భూమిలో టీడీపీ నాయకుడి అక్రమ నిర్మాణాలు
- కన్నెత్తి చూడని అధికారులు

**చంద్రగిరి:** అధికార అండదండలతో టీడీపీ నాయకులు ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించేశారు. జాతీయ రహదారికి సంబంధించిన రెండు సెంట్ల పట్టా భూమిని చూపిస్తూ సుమారు 18 సెంట్లలో కమర్షియల్ భవన నిర్మాణాలకు పాల్పడుతున్నారు. వివరాల్లోకెళితే... మండలంలోని రాయలపురం పంచాయతీ సర్వే నం.318లో జాతీయ రహదారికి ఆనుకుని డీకేటీ, కాలువ పోరపోకు భూమి ఉంది. ఈ క్రమంలో అక్కడ టీడీపీ సానుభూతిపరుడు సింగంశెట్టి రాముకు 2 సెంట్ల పట్టా భూమి ఉంది. వాటికి ఆనుకుని సుమారు 18 సెంట్ల డీకేటీ, కాలువ పోరంబోకు స్థలం ఉండడంతో దర్జాగా ఆక్రమించి దాబా నిర్మాణం చేపట్టాడు. ప్రస్తుతం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఒక సెంటు భూమి రూ.12 లక్షలకు పైగా ధర పలుకుతోంది. ఈ లెక్కన 18 సెంట్లకు సుమారు రూ.2 కోట్ల వరకు విలువ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గత కొంత కాలంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో పాటు కాలువపైన నిర్మాణం చేస్తున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ హేమాద్రిని వివరణ కోరగా.. గత వారం రోజుల క్రితం కాలువ ఆక్రమణపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశామని, సర్వే నిర్వహించి కాలువ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ శివరామ సుబ్బయ్యను వివరణ కోరగా.. ఇప్పటికే విచారణ చేపట్టామని, సర్వే చేసి కాలువ, డీకేటీ భూములు ఆక్రమణలకు గురైనట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అయ్యో..పాపం!

- లారీ కింద పడి రెండేళ్ల చిన్నారి మృతి
- కన్నీరుమున్నీరైన వలస కార్మికులు



మృతి చెందిన చిన్నారిని ఒడిలో పెట్టుకుని విలపిస్తున్న తల్లి పూజాసేటి

**చిల్లకూరు:** పొట్టకూటి కోసం ఊరుగాని ఊరు వచ్చారు. మూడేళ్లుగా ఇక్కడున్న పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. పుట్టిన ఒక్కగానొక్క గారాలపట్టీని అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. అయితే విధి ఆడిన వింత నాటకంలో చిన్నారి లారీ చక్రాల కింద పడి తనువు చాలించడం వారిని తీవ్రంగా బాధించింది. రక్తపు మడుగులో మృతిచెందిన చిన్నారిని ఒడిలో పెట్టుకుని కన్నీళ్లు పెడుతూ రోదించిన తీరు చూపరులను కలిచివేసింది. వివరాలు.. ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన సరోజ్ బేహారా, అదే ప్రాంతానికి చెందిన పూజాసేటీని వివాహం చేసుకుని మూడేళ్ల క్రితం చిల్లకూరు మండలం, లింగవరం ప్రాంతానికి వలస వచ్చాడు. అప్పటి నుంచి భార్యాభర్తలు ఇద్దరూ ఇదే ప్రాంతంలోని పలు పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి సుబద్ర బెహరా అనే రెండేళ్ల పాప ఉంది. ఈ క్రమంలో వారు నివాసం ఉండే ప్రాంతానికి సోమవారం ఒక ఐషర్ లారీ లోడ్డుతో వచ్చింది. సమీపంలో ఉన్న బయో పరిశ్రమకు ఎలా వెళ్లాలని డ్రైవర్ అడగ్గా.. ఆ పరిశ్రమకు పక్కనే ఉన్న రొయ్యల కంపెనీలో పని చేస్తున్న సరోజ్‌బెహరా తాను కూడా అదే మార్గంలో వెళుతున్నానని దారి చూపిస్తానని చెప్పి లారీ ఎక్కాడు. దీంతో అతని భార్య, చంటి బిడ్డను ఎత్తుకుని లారీ వద్దకు వచ్చి అతనితో మాట్లాడుతోంది. ఇంతలో బిడ్డ లారీ ముందు చక్రం వద్దకు వెళ్లి ఆడుకుంటోంది. గమనించని తల్లి ఇంటికి వెళ్లింది. ఇంతలో డ్రైవర్ లారీని కదిలించడంతో చిన్నారి చక్రాల కింద పడి ఛిద్రమైంది. స్థానికులు గమనించి బిగ్గరగా కేకలు వేయడంతో తల్లిదండ్రులు హుటాహుటిన తేరుకుని బిడ్డదగ్గరకు చేరారు. రక్తపు మడుగులో ఉన్న గారాలపట్టీని చూసి గుండె లవిసేలా రోదించిన తీరు స్థానికులను కలచివేసింది. ఎస్‌ఐ సుధీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. బిడ్డ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,604 మంది స్వామివారిని దర్శించుకోగా 31,536 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూ లైన్‌లో అనుమతించారని తెలుపుతున్నారు.

## తిరుమలకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై ఆంక్షలు

- భక్తుల భద్రత దృష్ట్యా టీటీడీ నిర్ణయం

**తిరుమల:** శ్రీవారి భక్తుల భద్రత దృష్ట్యా ఆగస్టు 12వ తేదీ సోమవారం నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే రెండు ఘాట్ రోడ్‌లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను అనుమతించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ఆగస్టు 12వ తేదీ సోమవారం నుండి వెంటనే అమలులోకి వస్తుంది. టీటీడీ ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ తెలిపిన విధంగా, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వన్యప్రాణుల సంతానోత్పత్తి ఎక్కువగా ఉంటుంది. దీంతో క్రూర మృగాలు మొదటి ఘాట్ రోడ్డులో తరచుగా రోడ్లు దాటుతున్నాయి. భక్తులతో పాటు వన్యప్రాణుల ప్రయోజనాల దృష్ట్యా మానవ-జంతు సంఘర్షణను నివారించడానికి, సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే ద్విచక్రవాహనాలను మొదటి మరియు రెండవ ఘాట్ రోడ్‌లలో అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. కావున భక్తులు ఈ మార్పును గమనించి టీటీడీకి సహకరించాలని కోరుతోంది.

## జెండా పండుగకు 11 స్టాల్స్




జాతీయ పండుగ ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న జేసీ శుభం బన్సల్

**తిరుపతి అర్బన్:** స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే జెండా పండుగకు మొత్తం 11 స్టాళ్లు, 7 శకటాలు ఏర్పాటు చేయనున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన డీఆర్వో పెంచల కిషోర్‌తో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన పనులు వారు బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. జెండా పండుగ ఏర్పాట్ల పర్యవేక్షణ తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి చేపట్టాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్ బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణ, కవాతు ఏర్పాట్లకు సంబంధించి పోలీస్‌శాఖ, తుడా వారు అన్ని శాఖలను సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సీటింగ్ ఏర్పాట్లు తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి అప్పగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యతను డీఈఓ వి. శేఖర్‌కు అప్పగించారు. ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సేవలు డీఎంహెచ్‌వో డాక్టక్ శ్రీహరి చూడాలన్నారు.

## నిర్లక్ష్యమా.. ఒత్తిళ్లా!



దివంగత నేత వైఎస్‌ఆర్ పేరుపై ప్లాస్టిక్ టేప్

**తిరుపతి సిటీ:** ఎన్నికల ప్రక్రియ ముగిసి 3 నెలలు కావస్తున్నా వెటర్నరీ వర్సిటీ అధికారుల నిద్రమత్తులో ఉన్నట్లు తెలుస్తోంది. వర్సిటీలో వైఎస్‌ఆర్ పరిపాలనా భవనంపైన ఉన్న దివంగత నేత వైఎస్‌ఆర్ పేరుపై అంటించిన ప్లాస్టర్‌ను తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి చొరవతో వర్సిటీగా గుర్తింపు సాధించి, ఆయన మానసపుత్రికగా పేరుగాంచిన ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. టీడీపీ నాయకుల బెదిరింపులు కారణంగా వైఎస్‌ఆర్ పేరుపై అంటించిన ప్లాస్టిక్ టేపును తొలగించ లేదా...లేక అధికారుల నిర్లక్ష్యమా అంటూ ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు చర్చించుకుంటున్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి




రైల్వే స్టేషన్‌లోని గ్యారేజీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

**తిరుపతి(అలిపిరి):** పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని.. కోవిడ్ సమయంలో ఫ్రీజ్ చేసిన 18 నెలల డీఏ అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని.. 8వ పే కమిషన్ కమిటీని ఏర్పాటు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ అధ్యక్షులు సుదర్శనరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియన్ రైల్వే మెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సంయుక్త పిలుపులో భాగంగా స్థానిక రైల్వే గ్యారేజ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్‌లకు రెస్ట్ రూమ్‌ల సౌకర్యం కల్పించాలని చెప్పారు. కార్మికులకు 8 గంటల పని విధానం కల్పించాలని, రైల్వేలోని ఖాళీలను భర్తీచేసి కార్మికుల పనిభారం తగ్గించాలన్నారు. అదనపు పనిభారానికి అదనపు పోస్టులు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## పోటు కార్మికులకు రూ.50 లక్షల రుణాలు

**తిరుపతి కల్చరల్:** టీటీడీ పోటులో పని చేస్తున్న ఐదుగురు సభ్యులకు రుణాలు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.50 లక్షలు రుణాలను బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణంగా అందజేశారు. సోమవారం సొసైటీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రామరత్నం, పి.కృష్ణ, ఆర్.రమేష్, టి.సతీష్, జి.వరదరాజులు, సొసైటీ సీనియర్ అసిస్టెంట్ పీఆర్‌ఎల్.కుమార్, లీలావతి, భాగవతుల జయలక్ష్మి, వై.వెంకటేశ్వర్లు, డాక్టర్ వసంతకుమార్, పద్మావతి, కామేశ్వరరావు, చిత్రపు హనుమంతరావు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన తిరుమల

**చంద్రగిరి:** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి సి.మల్లవరం కూడలి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట అంబేడ్కర్ కాలనీకి చెందిన తిరుమల(25) వ్యక్తి గత పనులపై ద్విచక్ర వాహనంలో చంద్రగిరి వైపు వస్తున్నాడు. ఇదే క్రమంలో సి.మల్లవరం కూడలి వద్ద నిలబెట్టిన లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హెచ్‌ఐవీపై అవగాహన



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య బృందం

**తిరుపతి అర్బన్:** హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ మండలి, పలు స్వచ్ఛంద సేవా సంస్థల నేతృత్వంలో ×మీకు తెలుసా×' పేరుతో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అందులో భాగంగా తొలి రోజు కలెక్టరేట్‌లో సోమవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి నివారణపై ఊరూరా రెండు నెలలపాటు నాకో నేతృత్వంలోఅవగాహన కల్పిస్తామన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న సెట్విన్ సీఈవో డాక్టర్ మురళీకృష్ణ

**తిరుపతి కల్చరల్:** నేటి యువత విద్య, క్రీడలు, సాంస్కృతిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రావీణ్యత సంపాదించాలని, ప్రధానంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన శాఖ ఆదేశాల మేరకు సెట్విన్, యువజన సర్వీసులశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం యువతీ యువకుల 3కె రన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ పోటీలు ప్రారంభించి ప్రసంగించారు. ఏదైనా అనుమానస్పద పదార్థాలు కళాశాలల్లో ఉన్నట్లయితే సంబంధిత పోలీసు శాఖాధికారులకు తెలియజేయాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సెట్విన్ సీఈఓ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ నేటి ప్రపంచం సాంకేతిక రంగాలలో పోటీతత్వం ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో వాటిని అధిగమించి ముందంజలో ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ యువకులు విలాసవంతమైన పరిస్థితులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం 3కె రన్ పోటీలలో విజేతలుగా నిలిచిన మోహన్, రఘు, మయూరి, మౌనికకు జ్ఞాపికలం దజేశారు. జిల్లా ఏఎస్పీ కులశేఖర్, సెట్విన్ మేనేజర్ కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.